# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 26 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 369

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

ఫిరాయింపు ఎమ్మెల్యేల పై హైకోర్టులో విచారణ



# తెలంగాణ బడ్జెట్..

## రూ.2,91,159 కోట్లు

- గత ప్రభుత్వ విధ్వంసం నుంచి విజయతీరాలకు
- ఆర్థిక లోటు నుంచి కోలుకునే దిశగా అడుగులు
- వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు
- ఆర్థిక లోటు అంచనా రూ.49,255.41 కోట్లు
- ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లు
- రెవెన్యూ మిగులు అంచనా రూ.297.42 కోట్లు
- వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
- ఉద్యానశాఖకు రూ.737కోట్లు
- పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
- రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
- గృహజ్యోతికి రూ.2,418కోట్లు
- ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు
- రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు రూ.1,525 కోట్లు
- స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
- ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
- ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
- మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
- బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
- వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
- ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
- అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
- పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు
- ఐటీ శాఖకు రూ.774 కోట్లు
- నీటిపారుదల రంగానికి రూ.22,301 కోట్లు
- విద్యకు రూ.21,292 కోట్లు
- హోంశాఖకు రూ.9,564కోట్లు
- రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు

**హైదరాబాద్:** అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగు పెట్టించేలా..వ్యవసాయాన్ని గాడిలో పెట్టించేలా...అనేక రంగాలను భ్రష్టు పట్టించి, అప్పులు చేసిన తెలంగాణను తలెత్తుకునేలా చేసేలా...కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి వార్షిక బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీకి సమర్పించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో దివాళా తీయించిన క్రమంలో మళ్లీ పట్టాలకు ఎక్కించేలా ప్రభుత్వం పూనుకుందని చెబుతూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మండలిలో మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎన్నికలు ముగిసి, కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత.. కేటాయింపులు ఏవీ

లేకపోయిన సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆరుగ్యారెంటీల అమలు, ఇచ్చిన హామీలు పూర్తి చేయడం, అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రకటిస్తూ..డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ. 2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ. 33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ. 35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ. 57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే సింహభాగం ప్రకటించారు. రూ. 72,659 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది రైతుల తలరాతలు మార్చే చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశ చరిత్రలో వ్యవసాయరంగానికి ఇది ఒక మైలురాయి అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. రైతు భరోసా సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని, బడ్జెట్‌అంటే.. కేవలం అంకెల సమాహారం కాదు. విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా అంటూ ప్రకటించారు. జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. అసమానతలు లేని సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రైతు కూలీలకు రూ. 12వేలు అందించే బృహత్తర కార్యక్రమం చేపడతాం అని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి

భద్రత కల్పిస్తాం. వరి రైతులకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. ఆయిల్‌పామ్ రైతులకు అవసరమైన సాయం అందిస్తాం. 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 77,857 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగ్గా.. 23,131 ఎకరాలకు అనుమతులిచ్చాం' అని భట్టి విక్రమార్క చెప్పారు.

## విద్యారంగానికి అరకొర నిధులు



2లో

- యూనివర్సిటీల అభివృద్ధి ఊసేది
- బడ్జెట్ తీరుకు నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు

## కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దిష్ట విధానం లేదు



- బడ్జెట్‌లో అన్నిరంగాలను విస్మరించారు
- వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై అస్పష్టత
- మీడియా పాయింట్ వద్ద కెసిఆర్ విమర్శలు
- ఓటమి తరవాత తొలిసారి అసెంబ్లీకి హాజరు



2లో

## సుప్రీం ఆదేశాలతో నీట్ తుది ఫలితాల వెల్లడి

- 61 నుంచి 17కు తగ్గిన టాప్ ర్యాంకర్ల సంఖ్య
- వెబ్‌సైట్‌లో ఫలితాలను విడుదలచేసిన ఎన్‌టిఎ



2లో

## బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరోటి లేదు

- ఆత్మస్తుతి..పరనిందలా బడ్జెట్ ప్రసంగం
- ఎన్నికల హామీలకు ఎగనామం పెట్టిన భట్టి
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు




## ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ కాళేశ్వరం

- చిన్న ఘటనను భూతద్దంలో చూపి చిన్నచూపు
- పంపింగ్ చేసి వెంటనే ప్రాజెక్టులను నింపాలి
- కాళేశ్వరం చేరుకున్న బిఆర్ఎస్ బృందం
- ప్రభుత్వ తీరును ఎండగడతామన్న కెటిఆర్



2లో

వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ
2
శుక్రవారం 26 జూలై 2024



# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టులో విచారణ



**హైదరాబాద్:** ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపు అంశంపై తెలంగాణ హైకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై చర్యలు తీసుకో వాలంటూ చేసిన ఫిర్యాదును స్పీకర్ తీసుకోలేదని భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ తన ఫిర్యాదును స్వీకరించేలా ఆదేశించాలని కోర్టును కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను తీసుకోవాలని, పిటిషనర్‌కు ధ్రువీకరణ రశీదు ఇవ్వాలని స్పీకర్ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై దాఖలు చేసిన పిటిషన్‌లపైనా విచారణ జరిగింది. స్పీకర్ నిర్ణయం తీసుకోక ముందే పిటిషనర్లు కోర్టుకు వచ్చారని ఏజీ తెలిపారు. స్పీకర్ ఇండిపెండెంట్ ట్రిబ్యునల్ అని.. కోర్టుల జోక్యం ఉండదన్నారు. గతంలో సుప్రీంకోర్టు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని ఏజీ తెలిపారు. 3 నెలలైనా స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న వాదన సరైంది కాదన్నారు. వివాదం కోర్టులో ఉన్నందున స్పీకర్.. పిటిషన్లను పరిశీలించలేదని ఏజీ వివరించారు.

# సుప్రీం ఆదేశాలతో నీట్ తుది ఫలితాల వెల్లడి



**న్యూఢిల్లీ:** నీట్ యూజీ 2024 పరీక్ష వివాదం వేళ ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఫిజిక్స్ విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పరీక్ష తుది ఫలితాలను ఎన్‌టీఏ గురువారం విడుదల చేసింది. ఇందులో 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో టాప్ ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా... మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటీ-దిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని... ఆప్షన్ 4 ఒక్కటే సమాధానమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థులకే మార్కులు ఇవ్వాలంటూ ధర్మాసనం పరీక్ష నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి రివైజ్డ్ ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. తాజాగా ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడించగా.. సుమారు 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులు కోల్పోయారు. దీంతో మెరిట్ లిస్ట్ మారింది. అంతేకాదు.. 720కి 720 స్కోరు సాధించిన 61 మందిలో ఈ ప్రశ్నకు మార్కులు పొందిన వారు 44 మంది ఉన్నారు. వారి స్కోరు కూడా మారడంతో టాప్ ర్యాంకర్ల జాబితా 17కు తగ్గింది.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దిష్ట విధానం లేదు

హైదరాబాద్: తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై నిర్దిష్టమైన విధానం లేదని భారాస అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ విమర్శించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన తొలిసారి అసెంబ్లీకి హాజరయ్యారు. కెసిఆర్ ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్న వారి ఉత్కంఠకు తెరదించుతూ సమావేశాలకు వచ్చారు. బడ్జెట్ ప్రసంగం తరవాత అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. భారాస హయాంలో మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఎగ్గొడతామని చెబుతోంది. మేం రైతులకిచ్చిన డబ్బును దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వమని తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్, నీటి సరఫరా, గొర్రెల పంపిణీ లేదు. రైతు భరోసా గురించి ప్రస్తావనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వృత్తి కార్మికులను వంచించింది. రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇది పేదల, రైతు బడ్జెట్ కాదని అన్నారు. ప్రభుత్వానికి ఒక విదానమంటూ లేదన్నారు. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదన్నారు. రైతు భరోసాలో అనేక ఆంక్షలు పెడుతున్నట్టు చెప్పారు. ప్రజల గొంతు కోసింది ఈ ప్రభుత్వం. దళితబంధు పథకం ప్రస్తావనే లేదు. దళితులంటే ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? గొర్రెల పెంపకం పథకానికి తూట్లు పొడిచారు. ఒత్తి పలకడం తప్ప భట్టి కొత్తగా చెప్పిందేమీ లేదు. రైతులను పొగిడినట్టే పొగిడి నిండా ముంచారు. బడ్జెట్ ఒట్టి డొల్ల. అన్ని వర్గాలను మోసం చేసింది. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదు. పేదల కోసం ఒక్క పాలసీ అయినా



ప్రకటించారా? బడ్జెట్‌లో ఒక పద్దు.. పద్ధతి లేదు. బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం అన్నారు. యాదవులు, మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చాం. ఈ ప్రభుత్వానికి పాలసీ లేదని అర్థమైంది. ఐటీ, పారిశ్రామిక పాలసీ ఏది? ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకం ప్రకటించలేదు' అని కేసీఆర్ విమర్శించారు. ఈ బడ్జెట్‌ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. . రైతులను పొగిడినట్లే పొగిడి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. తాము ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. మత్స్యకారులకు భరోసా లేదని గొర్రెల పంపిణీ పథకాన్ని పూర్తిగా మూసివేసినట్లు కనిపిస్తోందని అన్నారు. దళిత బంధు ప్రస్తావన లేదని తెలిపారు. ఒక్క కొత్త పథకం ప్రవేశపెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ, పరిశ్రమల సంగతి ఏంటని ప్రశ్నించారు. రైతులను వృత్తికార్మికులను ప్రభుత్వం వంచించిందని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. ఆయారంగాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటు న్నారో విధివిధానాలు లేవన్నారు. ఉన్న పథకాలను మూసివేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ఓడిన తర్వాత.. ప్రతిపక్ష నేత హోదాలో బ్జడెట్ సమావేశానికి హాజరైన కేసీఆర్.. మీడియా కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడి.. తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు.

# బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరోటి లేదు



**హైదరాబాద్:** రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆసాంతం ఆత్మస్తుతి, పరనింద తప్ప మరేమీ లేదని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. బడ్జెట్ లో ఆసరా పెన్షన్‌ల ప్రస్తావనే తీసుకురాలేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని, కానీ ఆ ఊసే ఎత్తలేదని మండిపడ్డారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చారని, ఆ విషయాన్ని కూడా ఎక్కడా ప్రస్తావించలేదని హరీష్‌రావు ఆరోపించారు. ఆసరా పెన్షన్‌ల ప్రస్తావన తేకుండా వితంతువులు, వృద్ధులు, వికలాంగులను ప్రభుత్వం నిరాశపర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుకు పేదల ప్రభుత్వం అని చెప్పుకునే అర్హత లేదని అన్నారు. బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీలా ఉన్నదని, ఇది రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపేదని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ సర్కారు.. ఆ ప్రస్తావనే తేకపోవడం దారుణమని అన్నారు. ఆర్భాటంగా అభయ హస్తం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆరు గ్యారెంటీ ఊసెత్తలేదని మండిపడ్డారు. ఆసరా పింఛన్‌లు పెంచుతామని ఎన్నికల్లో హామీలు ఇచ్చారని, వృద్ధుల పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. బడ్జెట్ లో ఆ ప్రస్తావన ఎందుకు చేయలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడం ద్వారా ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న సర్కారు.. ఇప్పుడు రెండు లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడలేదని, మాయమాటలతో విద్యార్థులను మోసం చేసిందని హరీష్‌రావు మండిపడ్డారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పారని, ఇప్పుడు ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి కారణంగా ఇప్పటికే 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని గత ప్రభుత్వ పాలన మీద బురద జల్లే ప్రయత్నం చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు.ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 57 వేల కోట్ల అప్పులు తెచ్చుకుంటామని బడ్జెట్‌లో భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. గత ప్రభుత్వం కంటే రూ. 17 వేల కోట్ల అప్పులు ఎక్కువగా తెచ్చుకుంటామని ప్రతిపాదించారు. గతంలో ఆర్థిక మంత్రిగా నేను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 40 వేల కోట్లు ఎఫ్ఆర్‌బీఎం కింద అప్పులు ప్రతిపాదిస్తే, భట్టి విక్రమార్క మాత్రం రూ. 57 వేల కోట్లు ప్రతిపాదించారు. మా కంటే రూ. 17 వేల కోట్లు ఎక్కువగా చూపించారు అని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఘనతలను తమ ఘనతలుగా చెప్పుకునే ప్రయత్నం చేసి.. ఈ పదేండ్లలో అభివృద్ధే జరగలేదని చెప్పే ప్రయత్నం చేశారు భట్టి విక్రమార్క. ఈ దేశంలో తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది. పదేండ్ల కింద తెలంగాణ 13వ స్థానంలో ఉండే. అక్కడున్న తెలంగాణను ప్రథమస్థానంలోకి తెచ్చాం. దాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా మెచ్చుకుంది.గత పదేండ్లలో జరిగిన అభివృద్ధి కూడా తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం చేశారు. జాతీయ తలసరి ఆదాయం కంటే తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం ఒక లక్షా 64 వేల 63 రూపాయాలు ఎక్కువ. ఈ రాష్ట్ర పౌరుడి తలసరి ఆదాయం 3,47,299. అయితే దేశ పౌరుడి తలసరి ఆదాయం 1,83,236. అంటే తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం ఒక లక్షా 64 వేల 63 రూపాయాలు ఎక్కువగా ఉంది.. పదేండ్ల బీఆర్ఎస్ పాలన, కేసీఆర్ పాలన ఫలితం ఇది. మేం అధికారంలోకి వచ్చినప్పుడు 13 స్థానంలో ఉంటే.. ప్రథమ స్థానంలోకి వచ్చామంటే మా పరిపాలనకు గీటురాయి అని హరీశ్‌రావు పేర్కొన్నారుస్థూల ఉత్పత్తి రాష్ట్ర ప్రభుత్వ పనితీరును సూచిస్తుంది. కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు.. స్థూల ఉత్పత్తి రూ. 4, 51,580 కోట్లు.. ఈసారి 2023-24కు వచ్చేసరికి రూ. 14,63,963 కోట్లు. అంటే జీఎస్డీపీ పెరిగింది.. మూడు రెట్లు పెరిగిదంటే అది మా పనితీరుకు నిదర్శనం. జాతీయ వృద్ధిరేటు 9.1 ఉంటే.. తెలంగాణ వృద్ధి రేటు 11.9 శాతంగా ఉంది. తెలంగాణ వృద్ధిరేటు రెండు శాతం ఎక్కువగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని.. కళ్లుండి చూడలేని కబోదులు అలా మాట్లాడుతారు. భట్టి వ్యాఖ్యలపై హైదరాబాద్ ప్రజలు నవ్వుకుంటున్నారు. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో మొన్నటి దాకా పని చేసిన ప్రభుత్వం నా కంటే బాగా పని చేసిందని చెబుతూ ఇటీవలే సీఎం చంద్రబాబు నాయుడు కేసీఆర్ అభివృద్ధిని కొనియాడారు. హైదరాబాద్ అభివృద్ధిని లోకం మొత్తం మెచ్చింది. రజనీకాంత్ కూడా హైదరాబాద్ అభివృద్ధిని ప్రశంసించారు. ఆ రజినీలకు అర్థమైంది కానీ కాంగ్రెస్ గజనీలకు అర్థం కావడం లేదు.

# విద్యారంగానికి అరకొర నిధులు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బ్జడెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. విద్యారంగానికి కేవలం 7.3శాతం... ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన దాని కంటే తక్కువని అభిప్రాయపడింది. ఈ కేటాయింపులు నిరసనగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు పిలుపు నిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష్యా, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి. నాగరాజు తెలిపారు.గత బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించింది. అది ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్యయే మాత్రం అభివృద్ధి కాదని ఎస్ఎఫ్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పింది.కానీ దాని ఊసు ఈ బడ్జెట్లో లేదు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారు. దాని గురించి చర్చే లేదు. యూనివర్శిటీల అభివృద్ధి రాష్ట్రంలో 500 కోట్లతో ఎలా సాధ్యం అవుతుంది. వీటిలో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీ 200 కోట్లు పోనూ 300 కోట్లు పలహారం పంచినట్లు పంచారు. యూనివర్శిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి యూనివర్శిటీలు నోచుకోవు. ప్రజా ప్రభుత్వం ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో తెలపాలని ఎస్ఎఫ్ఎఐ ప్రశ్నిస్తోంది. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్,భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ప్రతి యూనివర్శిటీకి అభివఅద్ధికి నిధులు ఇస్తామని చెప్పారు. ఉస్మానియా కు 1000కోట్లు,మహిళ యూనివర్శిటీఅభివృద్ధి కోసం. 500 కోట్లు నిధులు నిర్వహణ, బాసర ఐఐటి అభివృద్ధి, అలాగే ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్శిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్శిటీలు అభివృద్ధి కోసం 500కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది. రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూనివర్శిటీలకు కనీసం నిర్వహణకు కూడా నిధులురావు. ఒక్క ఉస్మానియా యూనిర్శిటీకే 350 కోట్లు పైగా నిర్వహణకు అవసరం. కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జెఎన్టీయుహెచ్, ÷న్ ఆర్ట్స్, మహిళా యూనివర్శిటీ, అగ్రికల్చర్ యూనివర్శిటీ,వెటర్నరీ, హార్టీకల్చర్ లాంటి వాటికి నిధులు కేటాయింపులు లేవు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రకారం బాసర ఐఐటిల లాగా మరో రెండు కేటాయిస్తామని చెప్పి వాటి గురించి కూడా ప్రస్థావన లేదు. పాఠశాల విద్యారంగంలో ఖాళీలు భర్తీ , మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, ముత్రశాలలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని ఎస్ఎఫ్ ఐ భావిస్తోంది. గురుకులాలు నిర్మాణం కోసం కూడా కనీస



నిధులు లేవు ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాలు కూడా సరైన మౌళిక సదుపాయాలు లేవు. ఈ బడ్జెట్లో గత ఆరేళ్ళ నుండి పెండింగ్ ఉన్న స్కాలర్ షిప్స్ , ఫీజు రీయంబర్స్ మెంట్స్ 7 వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్నాయి. వాటికి విడుదల కోసం నిధులు కేటాయించలేదు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసిన స్పష్టమైన నిధులు లేవు. అందుకే ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం లాగా కాకుండా 15 శాతం పైగా నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి 7.3శాతం నిధులు మాత్రమే కేటాయించారు.

విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీ కూడా

ఎలాంటి చర్చ లేదు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది.

# ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ కాళేశ్వరం


**కరీంనగర్:** ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మేడిగడ్డలో జరిగిన చిన్న సంఘటనను భూతద్దంలో కాంగ్రెస్ నేతలు చూపుతున్నారని విమర్శించారు. కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టు అని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నా డ్యాంల పరిశీలన చేస్తున్నామని వివరించారు.

రైతులు ఆందోళన చెందితే ఇంకా ఎందుకు పంపింగ్ చేయడం లేదని రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి వద్ద పంపులు ఆన్ చేస్తే అన్ని ప్రాజెక్టులు నీటితో నింపవచ్చని అన్నారు. మేడిగడ్డ కొట్టుకు పోతుందని చేసిన ప్రచారం వట్టిదేనని తేల్చిచెప్పారు. శాసనసభ సమావేశంలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. రేపు కన్నెపల్లి, మేడిగడ్డ బారేజిని సందర్శిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత వారు బయలుదేరారు. అసెంబ్లీ నుంచి భారీ ర్యాలీగా ప్రత్యేక బస్సుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. కాళేశ్వరం చేరుకుని మొదటగా రిజర్వాయర్ సందర్శించారు. శుక్రవారం 10 గంటలకు కన్నెపల్లి పంపు హౌజ్, 11గంటలకు మేడిగడ్డ బ్యారేజీలను వారు సందర్శిస్తారు. అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు



చేస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కాళేశ్వరంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు. ప్రాజెక్టు పగుళ్లు, ఇసుకలో కూరుకుపోతోందంటూ చేసే ప్రచారాలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు. ప్రతినీటి బొట్టును ఒడిసిపెట్టాలన్న సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ లెవల్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పారు. కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలించేందుకు బయల్దేరిన బీఆర్ఎస్ నేతల బృందం కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్‌ను పరిశీలించింది. కాళేశ్వరం ప్రాజెక్టు సాయంతో పంజాబ్‌ను తలదన్నేలా తెలంగాణ ధాన్యం పండించిందని కేటీఆర్ గుర్తుచేశారు. చిన్న పొరపాటును పట్టుకుని నానాయాగీ చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టును వృథా ప్రయత్నంగా చూపించే కుట్ర జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది 45 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని అధికారులు చెబుతున్నారని అన్నారు. కాబట్టి నీళ్లు వృథా పోకుండా వెంటనే రిజర్వాయర్లను నింపాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు కిందకు వృథాగా పోతుందని ఇంజనీర్లు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. పంపింగ్ చేసే అవకాశం ఉన్నా కూడా ప్రభుత్వం చేయడం లేదని.. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ఎనిమిది నెలలుగా ప్రయత్నం జరుగుతుందని మండిపడ్డారు. రాజకీయ కక్షలు పెట్టుకుని రైతులను ఆగం చేయవద్దని సూచించారు. కాళేశ్వరం రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లను సందర్శిస్తున్నామని కేటీఆర్ అన్నారు. ఎండిపోతున్న పొలాలు, మండుతున్న రైతుల గుండెలను చూడ్డానికే వచ్చామని తెలిపారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం రిజర్వాయర్‌లో 240 టీఎంసీల నీళ్లను నింపుకోవచ్చని తెలిపారు. అంటే 24 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చని పేర్కొన్నారు.






# అసెంబ్లీ 27కు వాయిదాఉదయం బడ్జెట్‌కు కేబినేట్ ఆమోదం

**హైదరాబాద్:** బడ్జెట్ సమర్పణ అనంతరం తెలంగాణ అసెంబ్లీ వనివారానికి వాయిదా పడింది. 27కు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది. ఉదయం కేబినేట్ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. అంతకుముందు డిప్యూటి సిఎం భట్టి దంపతులు ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇక బ్జడెట్ సమావేశాలు ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 26, 28, 29, 30 తేదీల్లో సభకు సెలవు ప్రకటించారు. 27న బ్జడెట్‌పై చర్చ చేపట్టి, అదే రోజు ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరపనున్నారు. అదే రోజు పలు బిల్లులను సభ ముందుంచి ఆమోదించనున్నారు. ఆగస్టు 1, 2 తేదీల్లోనూ పలు బిల్లులను సభలో ప్రవేశపెట్టనున్నారు.

# విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన రాష్ట్ర బడ్జెట్.

**రాష్ట్ర బడ్జెట్ లో కనీసం 15 శాతం నిధులు కేటాయించాలి.**

**బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్ డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జులై 25:**



అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్ రూ 2,91,159 కోట్లలో విద్యారంగానికి కేవలం 7.3% మాత్రమే నిధులు కేటాయించడం దారుణమైన విషయం అని బాలల హక్కుల సంక్షేమ సంఘం ( బి హెచ్ ఎస్ ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నామ మాత్రంగా 7.3శాతం మాత్రమే కేటాయించిందని అన్నారు. బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3% అనేది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువగా ఉందని, గత ఓటాన్‌బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించగా అది ప్రస్తుతం పూర్తిస్థాయి బడ్జెట్ లో రూ 21,292 కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. ఈ నిధులు ప్రభుత్వ విద్యారంగం ప్రగతికి ఏమాత్రం దోహదం చేయవని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఈ బడ్జెట్లో దాని ఊసే లేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వము విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిన విషయం విధితమే,కానీ అదే బాటలో కాంగ్రెసు ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరింది. ఒకవైపు శాసన సభలో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న రోజునే, మంచిర్యాల జిల్లా నెన్నెల మండలము కుశ్నపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు 18 ఏళ్ళ కిందట కట్టిన బడి భవనంలో ఎనిమిదో క్లాసు విద్యార్థులు పగుళ్లు తేలిపోయిన స్లాబు వర్షాలకు ఉరుస్తుండటంతో తడవకుండా ఉండేందుకు గొడుగులు పట్టు కొని పాఠాలు వింటున్న వార్తా చిత్రము అన్ని దినపత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందన్నారు. ఇది రాష్ట్ర విద్యారంగం దీన స్థితిని తెలియచేస్తుందని గుర్తు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్ శుభ్రం చేసేవాళ్ళు లేరని, పాఠశాలల ఆవరణ, తరగతి గదులు శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో విద్యార్థులే తమ తమ తరగతి గదులు శుభ్రం చేసుకునే పరిస్థితి దాపురించిందని అన్నారు.

చాలా పాఠశాలలలో అటెండర్లు లేరని, రాత్రి కాపాలాదారులు లేరని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఉన్నత పాఠశాలలకు ఐదు లక్షల పైగా ఖరీదు చేసే టీవీ లు ఇవ్వడం జరిగిందన్నారు. కాపాలాదారులు లేక వాటి రక్షణ ప్రశ్నార్థకముగా ఉందని, హైస్కూలు హెడ్మాస్టర్లు ఈ టీవీ ల భద్రత పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు.

రూ 2,91,159 కోట్ల రాష్ట్ర బడ్జెట్లో 7.3% నిధులతో మౌళిక సదుపాయాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు.

పాఠశాల విద్యారంగంలో ఖాళీల భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, మూత్రశాలలు, మౌళిక సదుపాయాల కోసం ఈ నిధులు ఎంతమాత్రం సరిపోవని బాలల హక్కుల సంక్షేమ సంఘం భావిస్తుందని ఇంజమూరి రఘునందన్ అన్నారు.

# బడ్జెట్ లో బిసిలకు తీవ్ర అన్యాయం.

**రూ" 20 వేల కోట్లకు 9.900 కోట్లు మాత్రమే కేటాయింపు.**

**బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 25**



బడ్జెట్ లో బిసిలకు రూ" 20 వేల కోట్లు, సంవత్సరానికి లక్ష కోట్ల నిధులు కేటాయిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కేవలం 9, 900 కోట్లు మాత్రమే కేటాయించిందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రకుల పేదలకు జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు జరగలేదన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య అభివృద్ధి కోసం తగిన విధంగా నిధులు కేటాయించలేకపోయిందని అన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కాని పరిస్థితుల్లో, ఉపాధి అవకాశాల అభివృద్ధి కోసం పెద్దగా నిధులు కేటాయింపు జరగలేదన్నారు.తెలంగాణ సమాజంలో రెండు కోట్ల మంది అసంఘటిత రంగంలో పనిచేసే బహుజన శ్రామిక కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించకపోవడం అత్యంత శోచనీయమన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం లాగా బడ్జెట్ లో నిధులు కేటాయించి వాస్తవ పరిస్థితుల్లో అందుకు భిన్నంగా ఖర్చులు జరిగాయాని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ఆ ప్రభుత్వ బాటలో నడుస్తే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంపై పిడిఎస్ యూ ఆగ్రహం.

**రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 25:**




తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో కేవలం విద్యారంగానికి 21292 కోట్లు (7.31శాతం)మాత్రమే కేటాయించారని, విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గురువారం నగరంలో పిడిఎస్ యు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని , కానీ బడ్జెట్లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు బలోపేతం చేయకపోతే పేద బడుగు బలహీన వర్గాలకు చదువు దూరమవుతుందని , ఇప్పటికైనా బడ్జెట్ సవరించి విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో వీసీ నియమకాలు చేపట్టాలని, నగరంలో మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలను నిర్మించాలని అన్నారు. సంక్షేమ హాస్టల్లో సౌకర్యాలు పెంచాలని, సొంత భవనాల నిర్మించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, వరప్రసాద్, దేవదాస్, నాందేవ్, నితీష్, శ్రీకాంత్, ఆకాష్, వంశీ, రాహల్, సాయి తేజ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు .

# బట్టి మాటలన్నీ ఉత్త మాటలే

**బీజేపీ ఎమ్మెల్యే ధన్ పాల్.**

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్**




తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అనంతరం అసెంబ్లీలోని మీడియా పాయింట్ గురువారం బీజేపీ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని బద్నామ్ చేస్తూ అసెంబ్లీలో పెట్టిన తీర్మానం వెనుక ఉన్న మతాలబ్ ఏంటో తెలంగాణ ప్రజలకు తేటతెల్లం అయ్యిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీలనుండి తప్పించుకునేందుకు రేవంత్ సర్కార్ చేసిన కుట్రలో భాగమే ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ నిదర్శనం అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి కాంగ్రెస్ కు లేదని, తప్పించుకోవడానికే కేంద్ర ప్రభుత్వం పై విమర్శలు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మర్చిందంటు మల్లి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అప్పులపైనే ఆధారపడాల్సి వస్తుందని, కేవలం ఒక సంవత్సరానీకి దాదాపు 70 వేల కోట్ల అప్పుకు ప్రతిపదించడం జరిగిందని అన్నారు. తెలంగాణాలో ఇండ్లు లేని నిరు పేద, మధ్యతరగతి కుటుంబాలు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్న వారికీ కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళల్లో కారం కొట్టిందని, గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో 10 ఏళ్ళు మోసం చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మల్లి మోసం చేస్తుందని అన్నారు. స్థలం ఉన్నవారికి 5లక్షలు ఎస్సీ , ఎస్టీ లకు 6లక్షలు నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తామని చెప్పి, బడ్జెట్ లో ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని దీనిపై ప్రభుత్వం పునరాలోచ చేయాలని డిమాండ్ చేసారు. తెలంగాణ నిరుద్యోగ యువతను ప్రభుత్వం నట్టేట ముంచిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, తెలంగాణ కోసం అసువులు బాసిన అమరుల కుటుంబాలకు అన్యాయం చేసిందని, వారి కుటుంబంలో ఇంటికో ఉద్యోగం అన్నారు, గౌరవ వేతనం 25000 వేలు అన్ని ఉత్త మాటలుగా మిగిలాయాన్నారు. నిరుద్యోగులకు 4000 భృతి ఊసే లేదని, మహిళలకు ఇస్తానన్న 2500 పై ఎటువంటి స్పష్టత లేదని, చేయూత కింద మా ప్రభుత్వం వచ్చాక పెన్షన్ 4000 పెంచుతామన్నా రేవంత్ సర్కార్ గప్పాలు కొట్టి ఇప్పుడు దానికి నిధులు కేటాయించకపోవడం పై మండిపడ్డారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం అన్నారు, కానీ దానికి ఎటువంటి నిధులు కేటాయించలేదని, యాభైరెండు శాతం ఉన్న బిసిలకు 9 వేల కోట్లు ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు.

# బడ్జెట్‌పై కెసిఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గు

**బిజెపి ఆదేశాలతో అసెంబ్లీకి వచ్చారని మండిపాటు**

**కేంద్రబడ్జెట్‌పై స్పందించకుండా..ఇక్కడ విమర్శలా**

**అసెంబ్లీలో చర్చకు ఎందుకు రాలేదని నిలదీసిన సీతక్క**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత, విపక్ష నేత కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. కేసీఆర్ వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్.. రాష్ట్ర బ్జడెట్ మీద మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. తెలంగాణకు ద్రోహం చేసన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తే కేసీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని సీతక్క అన్నారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే అసెంబ్లీకి వచ్చిన మొదటి రోజే రాష్ట్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మెప్పు కోసమే కేసీఆర్ విమర్శలు చేస్తున్నారన్నారు. 6 నెలల తరువాత అసెంబ్లీ సమావేశాలకు రావడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అదికూడా బిజెపి ఆదేశిస్తేనే అసెంబ్లీకి వచ్చారని అన్నారు. 'ఎన్నడూ లేని విధంగా ఈ రోజు కేసీఆర్ మీడియా పాయింట్‌కి వచ్చారని అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ అన్నారు. తొందర్లోనే కోర్టు బోన్‌లోకి వస్తారు. కేసీఆర్ ఊహల్లో బతికారు. ఇంకా నేనే రాజు అనుకుంటున్నారు. మీరు పెట్టిన బడ్జెట్ ఎవరికి ఉపయోగ పడలేదు. నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ తెచ్చుకుంది. కానీ గత ప్రభుత్వం నీళ్ళు ఇవ్వలేదు.. నిధులూ ఇవ్వలేదు.. ఇంక నియామకాల ఊసే అస్సలు లేదు. అప్పులు చేసి తెలంగాణ ప్రజల జీవితాలపై వేశారు.' అని ఎమ్మెల్యే వంశీ కృష్ణ ఫైర్ అయ్యారు. వాస్తవానికి బ్జడెట్ దగ్గర ఉందని నారాయణఖేడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి అన్నారు. అందుకే ప్రతిపక్షానికి మింగుడు పడటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గంగలో కలిపారు. లక్ష రూపాయల రుణమాఫీ ఇప్పటికే చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కింది. ఇప్పటికి పెండింగ్ బిల్లులు రావడం లేదని అన్నారు. గత ప్రభుత్వం మాదిరి అంకెల రూపంలో బడ్జెట్ పెట్టకుండా.. అన్ని శాఖలకు కేటాయింపులు చేపట్టారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. ఒక్కో రంగానికి ఎన్ని డబ్బులు కేటాయిస్తున్నం అనేది విపులంగా వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు జరగాలని కేటాయింపులు చేయడం జరిగింది. గత బడ్జెట్ లో కన్నా వైద్య విద్య కోసం ఎక్కువ కేటాయింపులు చేశారు. రూ. 9 వేల కోట్లు పైచిలుకు బడ్జెట్ పెట్టి.. వైద్య విద్యకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుంది. బడ్జెట్ ను తులనాడే విధంగా కేసీఆర్ మాట్లాడారు. గత బడ్జెట్ పేపర్లకు పరిమితం అయ్యింది. కేసీఆర్ ఇంకా ఊహల్లో ఉండకుండా.. బడ్జెట్ ను ఆహ్వానించాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధన్ మోహన్ రావు అన్నారు. ఇది రైతు బడ్జెట్. తెలంగాణ వచ్చిన పదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టులు అని డబ్బులు తగలేశారు. గ్రామీణ ప్రాంతాల్లో

రోడ్లు.. త్రాగు నీటి సదుపాయాలు లేవు. స్కూల్స్‌లో టీచర్స్ లేరు. వైద్య, విద్య రంగాలకు నిధులు కేటాయింపు చేయడం జరిగింది. జాబ్ క్యాలెండర్ కూడా పెట్టడం జరిగింది.

# కరీంగర్‌కు ఎన్ని టిఎంసిలు ఇచ్చారో చెప్పండి

**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కరీంనగర్ జిల్లాకు ఎన్ని టీఎంసీల నీటిని రైతులకు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు తమ జిల్లాలో ఉన్న లోయర్, మిడ్ మానేరు డ్యామ్ పరిశీలనకు వెళ్తున్నారని తెలిపారు. 2టీఎంసీల నీటి కోసం తీసుకున్న ప్రణాళిక ఎందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు కాలేదని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... రెండు టీఎంసీల నీరు రాలేదు కానీ రూ. 2 వేల కోట్లతో మూడో టీఎంసీ నీటి గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. వర్షాకాలంలో నీళ్లు వస్తున్నాయి.. కానీ తాము కడితేనే వస్తున్నాయని చెప్పుకునే ప్రయత్నం బీఆర్ఎస్ నేతలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లంపల్లి, మిడ్ మానేర్ ప్రాజెక్టు ద్వారా నీళ్లు వెళ్తాయన్నారు. ముంపు గ్రామాల సమస్య ఎందుకు పరిష్కరించలేదో చెప్పి రావాలని అడిగారు. అధికారంలో ఉన్నప్పుడు నిర్వాసితులను ఎందుకు పట్టించు కోలేదని ప్రశ్నించారు. మూడో టీఎంసీ నీటిని ఎవరి లబ్ది కోసం అడుగుతున్నారో చెప్పాలని నిలదీశారు. యాదవులకు ఉన్న బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక తమ జిల్లాల్లో ఇప్పుడు పరిష్కారిస్తున్నా మని అన్నారు. 7 నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని.. మరి పదేళ్ల ప్రభుత్వంపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. యాదవులకు చెందిన 8500 డీడీలు గత ప్రభుత్వం ఎందుకు పట్టించు కోలేదని నిలదీశారు. తెలంగాణ గురించి మాజీ సీఎం కేసీఆర్ నిన్న ప్రెస్ మీట్ పెడితే బాగుండేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మరోవైపు.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారించిందిని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.

# కెసిఆర్ వ్యాఖ్యాలపై మండిపడ్డ భట్టి

**కేంద్ర బడ్జెట్‌పై ఎందకు స్పందించలేదని ప్రశ్న**


**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై భట్టి కౌంటర్ ఇచ్చారు. 'కేసీఆర్ నిన్న ఎందుకు సభకు రాలేదు..?. ఇంతే హడావుడిగా వెళ్లి కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు మాట్లాడలేదు..?. కేంద్ర ప్రభుత్వం చెబితే హడావుడిగా వచ్చారు. వారు చెబితేనే వెళ్లి హడావుడిగా మా మీద మాట్లాడారు. వారు మాకేంటి సమయం ఇచ్చేది..?. ప్రజలే వారికి విశ్రాంతి తీసుకోమని సమయం ఇచ్చారు. పక్క రాష్ట్రానికి నిధులు ఇస్తున్నారు. ఈ రాష్ట్రానికి మేలు చేయడానికి తెచ్చిందే రాష్ట్ర విభజన చట్టం' అని కేసీఆర్‌పై భట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. ఎండగతామని కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపైనా మండిపడ్డారు. మరోవైపు కాంగ్రెస్ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. కేసీఆర్‌ను తప్పకుండా జైలుకు పంపుతామన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను కేసీఆర్ విమర్శిస్తున్నారు. కేసీఆర్ నిన్ను జైలుకు పంపే బాధ్యత మేము తీసుకుంటాం. మీడియా పాయింట్‌కు వచ్చిన నువ్వు కోర్టు బోనుకు కూడా వెళ్తావ్ కేసీఆర్..?. గతంలో గొర్ల మీద దొరుకుతున్నది కేసీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్ద పీట వేసింది. ఈ బడ్జెట్ చూసి తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారు. తెలంగణ ప్రజలు ఇప్పటికే మీకు బుద్ధి చెప్పారు' అని ఐలయ్య చెప్పుకొచ్చారు.



# నారా రోహిత్ సుందరకాండ

నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో 'సుందరకాండ' చిత్రం తెరకెక్కుతుంది. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి ఈ ఫన్ ఫిల్డ్ రోమ్-కామ్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈచిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు నారా రోహిత్. అయన నటిస్తున్న 20వ చిత్రమిది. నేడు నారా రోహిత్‌కి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో రోహిత్ ఇన్నోసెంట్ లుక్స్‌లో కూల్ డ్రెస్‌లో క్లాసీ, ఛార్మింగ్ గా కనిపించారు. చక్కని ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతుందని మేకర్స్ తెలిపారు. త్వరలో టీజర్‌ను త్వరలో విడుదల చేయనున్నారు. నారా రోహిత్ సరసన విర్తి వాఘని హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రదీప్ ఎమ్ వర్మ సినిమాటోగ్రఫీ అందించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు.

# పుష్ప-2 ఆలస్యం అయినా.. అంచనాలు మించుతుంది







నటుడు అల్లు శిరీష్ ఆసక్తికర కామెంట్స్ పుష్ప-2 ఆసల్యం అయినా ప్రేక్షకుల అంచనాలను మాత్రం అందుకుంటుందని అల్లు శిరీష్ కామెంట్ చేశారు. తన సోదరుడు, నటుడు అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న 'పుష్ప 2' పై నటుడు అల్లు శిరీష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పుష్ప 2' విడుదల ఆలస్యం కానుందంటూ జరుగుతోన్న ప్రచారంపై 'బడ్డీ' ప్రమోషన్స్‌లో స్పందించారు. సినిమా ఎప్పుడు వచ్చినా అభిమానుల అంచనాలను తప్పకుండా అందుకుంటుందన్నారు. 'పుష్ప 2'పై మీ ఉత్సాహాన్ని ఇలాగే కొనసాగించండి. డిసెంబర్ 6వ తేదీ లేదా ఎప్పుడు వచ్చినా ఆ సినిమా తప్పకుండా మీ అంచనాలు అందుకుంటుంది. ఇది మా అన్నయ్య సినిమా అని నేను ఈ విషయాన్ని చెప్పడం లేదు. సుకుమార్ చాలా అద్భుతంగా దీనిని చెక్కుతున్నారని ఫిల్మ్‌నగర్‌లో మాట్లాడుకుంటుంటే అది నావరకూ వచ్చింది. దానినే మీతో పంచుకుంటున్నా' అంటూ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు.

అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన యాక్షన్ డ్రామా మూవీ 'పుష్ప ది రైజ్'. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఇది తెరకెక్కింది. సుకుమార్ దర్శకుడు. రష్మిక కథానాయిక. దీనికి కొనసాగింపుగా 'పుష్ప ది రూల్' సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. తొలుత దీనిని ఆగస్టు 15న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించినప్పటికీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల డిసెంబర్ ఆరో తేదీకి వాయిదా వేశారు.


మరోవైపు, 'ఊర్వశివో రాక్షసివో' తర్వాత అల్లు శిరీష్ నటించిన చిత్రం 'బడ్డీ'. స్టూడియో గ్రీన్ పతాకంపై తెరకెక్కింది. గాయత్రి భరద్వాజ్, గోకుల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ ఆంటోన్ దర్శకత్వం వహించగా.. కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఆగస్టు 2న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోని పలు నగరాల్లో ఇప్పటికే ప్రీమియర్స్ వేయగా మంచి టాక్ లభించింది.





# జంధ్యాల మార్క్..మారుతీనగర్ సుబ్రమణ్యం

దర్శకుడు లక్ష్మణ్ కార్య ఇంతకు ముందు 'హ్యాపీ వెడ్డింగ్' అనే సినిమాకి దర్శకత్వం వహించాడు. అయితే ఆ సినిమా ఆశించినంతగా నడవలేదు, కానీ లక్ష్మణ్ కార్య దర్శకత్వ పటిమ ఏంటో ఆ సినిమా ద్వారా తెలిసింది. అందుకే ఇప్పుడు రెండో సినిమాగా 'మారుతీనగర్ సుబ్రమణ్యం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాకి లక్ష్మణ్ కార్య దర్శకత్వంతో పాటు, రచన, మాటలు, స్క్రీన్ ప్లే కూడా అందించారు. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుందని తెలుస్తోంది. అయితే ఈ సినిమా గురించి పరిశ్రమలో ఒక టాక్ బయలుదేరింది. అదేంటంటే ఈ సినిమాని ఇప్పటికే కొంతమంది పరిశ్రమలోని వారు చూసారని, ఈ సినిమా చూసిన తరువాత నవ్వకుండా ఉండలేరు అని అంటున్నారు. ఈ సినిమాలో రావు రమేష్ ప్రధాన పాత్ర పోషించారు. మామూలుగానే ప్రేక్షకులు ఒక సినిమాలో క్యారెక్టర్ పాత్రలో కనపడే రావు రమేష్ చెప్పిన మాటలని ఎంతో ఆస్వాదిస్తారు, అలాంటిది ఇప్పుడు అయన ప్రధాన పాత్రలో చేస్తున్న సినిమాలో అతని చెప్పే మాటలకి పడి పడి నవ్వాల్సిందే అని ఈ సినిమా చూసిన వాళ్ళు చెపుతున్నారు. ఇంకొక ఆసక్తికర అంశం ఏంటంటే ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీస్ మేకర్స్ కూడా చూసారని, అందుకే వాళ్ళు ఈ సినిమాని టేక్ అప్ చేసారని ఒక వార్త నడుస్తోంది. అలాగే ఈ సినిమా ప్రముఖ దర్శకుడు సుకుమార్ కూడా చూసి ఎంతో ఆస్వాదించారని తెలుస్తోంది. ఇందులో రావు రమేష్ లాంటి నటుడికి ఒక ఫుల్ లెంగ్త్ రోల్ ఇస్తే తన మాటలతో ఎలా ప్రేక్షకులని మంత్రం ముగ్దుల్ని చేస్తాడో ఈ సినిమా నిరూపిస్తుంది అని కూడా అంటున్నారు. హింసాత్మక సినిమాలతో ప్రేక్షకుడికి ఊపిరి ఆడక ఉన్నటువంటి ఈ సమయంలో ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' ప్రాణవాయువు లాంటిదని అంటున్నారు. 'ఇది ఒక జంధ్యాల మార్కు సినిమాలా ఉంటుంది' అని ఈ సినిమా చూసిన వ్యక్తులు అంటున్నారు. దర్శకుడు జంధ్యాల సునిశితమైన హాస్యంతో తనదైన శైలితో ప్రేక్షకులను తన సినిమాలతో కడుపుబ్బా నవ్వించేవారు, ఇప్పుడు అలాంటి సినిమాలు కరువయ్యాయి, కానీ ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' సినిమాతో ఆ కరువు తీరిపోతుంది అని అంటున్నారు. అలాగే ఇంత వరకు క్యారెక్టర్ పాత్రలు వేస్తూ వచ్చిన రావు రమేష్ ఈ సినిమాతో ప్రధానపాత్రలో కనపడుతున్నారు. మధ్య తరగతి కుటుంబాలకి చెందిన కథలు ఈమధ్య రావటం మానేశాయి, ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' తో అటువంటి సినిమాలకి శ్రీకారం జరుగుతుందని పరిశ్రమలో అనుకుంటున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు అందరినీ అలరించాయి, ట్రేండింగ్ కూడా అయ్యాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఆగస్టు మూడో వారంలో విడుదల కావచ్చు అని అంటున్నారు.




# ఆకాశ్ పూరీ..ఇకనుంచి ఆకాశ్ జగన్నాథ్

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు ఆకాశ్ పూరీ పేరును ఆకాశ్ జగన్నాథ్‌గా మార్చుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈవిషయాన్ని తెలియజేశారు. ఇకపై తన పేరు ఆకాశ్ పూరీ కాదని.. ఆకాశ్ జగన్నాథ్ అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్‌గా మారింది. కొత్త పేరు.. కెరీర్ పరంగా ఆయన నూతన విజయాలు అందుకోవాలని నెటిజన్లు కోరుకుంటున్నారు. ఉన్నట్టుండి ఆకాశ్ తన పేరు మార్చుకోవడానికి గల కారణం చెప్పలేదు. పూరీ జగన్నాథ్ తనయుడిగా ఆకాశ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 'చిరుత', 'బుజ్జిగాడు' తదితర చిత్రాల్లో బాలనటుడిగా అలరించారు. 'ఆంధ్రాపోరి'తో హీరోగా మారారు. ఆ తర్వాత 'మెహబూబా', 'రొమాంటిక్', 'చోర్ బజార్' సినిమాల్లో నటించారు. ఆయా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమయ్యాయి.



# గూఢాచారి సీక్వెల్‌గా జి2



టాలీవుడ్ హిస్టరీలో ల్యాండ్ మార్క్‌గా నిలిచిపోయే సినిమాల జాబితాలో ముందు వరుసలో ఉంటుంది గూడఛారి. అడివిశేష్ టైటిల్ రోల్ పోషించిన ఈ మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే ఫ్రాంఛైజీలో ఈ చిత్రానికి కొనసాగింపుగా జీ2కూడా వస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మేజర్ సినిమాకు ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. వినయ్ కుమార్ చేతిలో పిస్తోల్ పట్టుకున్న తాజా స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన జీ2 (ఉ2) ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచుతోంది. షూటింగ్ కొనసాగుతున్నట్టు తెలియజేశారు. అడివి శేష్ ఈ మూవీలో మరోసారి స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా జీ2 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.

# జాన్వీ స్పోర్ట్స్ డ్రామా నేడు నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల

రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా శరణ్ శర్మ తెరకెక్కించిన స్పోర్ట్స్ డ్రామా 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు రాగా అందులో జాన్వీ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈ చిత్రం కోసం జాన్వీ ఎంతో కష్టపడినట్లు పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించారు. ఇప్పుడీ సినిమా ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు నెట్‌ఫ్లిక్స్ వేదికగా జులై 26 నుంచి ప్రసారం కానుంది. కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రంలో రాజ్‌కుమార్ రావ్, రాజేశ్ శర్మ, కుముంద్ మిశ్రా తదితరులు కీలకపాత్రల్లో కనిపించారు. మహేంద్ర (రాజ్ కుమార్ రావ్) ఓ ఫెయిల్యూర్ క్రికెటర్. మరో ఏడాది అవకాశమిస్తే తానేంటో నిరూపించుకుంటానని బతిమాలతాడు. అయినా తండ్రి వినిపించుకోకుండా తన స్పోర్ట్స్ షాప్ నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తాడు. మహిమ అగర్వాల్ (జాన్వీ కపూర్)తో పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తారు. తన ఫెయిల్యూర్ స్టోరీ చెప్పినప్పటికీ మహేంద్ర మనసు నచ్చి పెళ్లి చేసుకోవడానికి అంగీకారం తెలుపుతుంది మహిమ. వైద్యురాలైన ఆమెకీ క్రికెట్ అంటే పిచ్చి. అలా ఆ ఇద్దరి క్రికెట్ ప్రేమ వాళ్లని ఎక్కడి వరకు తీసుకెళ్లిందనేది కథాంశం.